చిన్న నవలల పోటీలో మూడవ బహుమతి రు.1,500/-లు పొందిన నవల

# నది

ఎ.వి.వి.యస్.యస్.ప్రసాద్

## మంచు తెరలు ఇంకా విడలేదు...

**సుప్రభాతం ఆలపిస్తూ, ప్రకృతిని మేల్కొలుపుతున్నట్టు పచ్చని చెట్ల చిటారుకొమ్మల నుంచీ, చివురు రెమ్మల నుంచీ పక్షుల కిలకిల రవాలు...**

కొద్దిదూరం వరకు మిత్రుడితోవచ్చి, వెనక్కిమళ్ళిపోతూ, వీడ్కోలుచెప్పే మిత్రుడిలా రైలు కూతకూసి వెళ్ళిపోయింది...

"తూరుపు సిందూరపు వన్నెలలో ఉదయరాగం...." అన్నాడు మూర్తి చుట్టూచూస్తూ—



"ఇక్కడ్నుంచి దాదాపు ఓ మైలు నడవవలసి వుంటుంది...." అన్నాడు ప్రసాద్.

"నేను ముందే చెప్పానుగా.... .... కనీసం బస్సు సౌకర్యం కూడాలేని ఈ వూళ్ళో వుండడం కష్టమని...." అన్నాడు వివేకానంద.

అతనికి మొదటినుండి ఈ వూరికి రావడం ఇష్టంలేదు. ఏ అజంతాకో, ఎల్లోరాకో అయితే ఉత్సాహంగా వుండేది.... వెళ్ళబోయేది పేరుపొందిన వినోద స్థలంకాదు. పుణ్యక్షేత్రం కాదు. చిన్నపల్లె.



మిత్రులు మరీ బలవంతపెడ్తే కాదనలేక బయలుదేరాడు.

తిలక్ ఏమీ మాట్లాడలేదు.

మెల్లగా నడక ప్రారంభించారు నలుగురు.

మంచులో నడవడం 'కొత్తగా' వుంది నలుగురికి.... మిగిలిన ముగ్గురూ వేగంగా అడుగులు వేస్తున్నారు ... ఒక్క మూర్తి తప్ప :

మూర్తికి కుడిచేతిలో బట్టల సూట్‌కేస్.... ఎడం చేతిలో ఎయిర్‌బ్యాగ్.... ఆ ఎయిర్‌బ్యాగ్ నిండా పుస్తకాలు.... ఎక్కడికి వెళ్ళినా తనతో పుస్తకాలు తీసుకెళ్తాడు.... పుస్తకాలు చదవడము అతని హాబీ.... .... పుస్తకాల్ని ఎవర్ని ముట్టుకోనివ్వడు....:

ఓ పుస్తకం చదివిన వెంటనే మిత్రుల్ని పట్టుకొని, బలవంతాన్న అందులోని (పుస్తకం లోని) వాక్యాలు చదివి విన్పించి మరీ ఆనందిస్తాడు.

తిలక్ అమృతం కురిసిన రాత్రి. కృష్ణశాస్త్రి కృష్ణపక్షం, బాపిరాజు శశికళ, నండూరి యెంకి పాటలు.... తరుచు చదువుతుంటాడు.

మంచి సాహితీ అభిమాని.

"ఇలా ఈ మట్టిరోడ్లమ్మట మట్టికొట్టుకుంటూ ఎంత దూరం నడవాలిరా?" విసుగ్గా అడిగాడు వివేకానంద.

"హడావిడి ప్రపంచంలోంచి నిశ్శబ్ద ప్రపంచంలోకి నడిచే దూరం...."

"పొద్దునే మొదలుపెట్టావా 'కొరడా దెబ్బలు'?" కోపంగా అన్నాడు వివేకానంద. మూర్తి మాటలు అతనికి నచ్చవు.

".... అదిగో.... .... అటు చూడండి...." మాటని మార్చేసి అటువైపు చూపెట్టాడు ప్రసాద్.

దూరంగా మంచుతెరల చాటునుండి మెల్లగా సాగిపోతోంది ఒంటెద్దుబండి.

నిముషంపాటు అలా చూస్తుండిపోయారు మిత్రులంతా ఆ దృశ్యం—

"ఎంత ప్రశాంతంగా సాగిపోతోంది" అన్నాడు మూర్తి. నిముషం తరువాత—

"సరేగాని ప్రసాద్.... .... ఇంతకీ ఈ వూళ్ళో చూడదగ్గవి ఏమైనా వున్నాయా?" వివేకానంద ప్రశ్నించాడు.

"వున్నారు."

"వున్నారా?"

"వూఁ"

"ఎవరు?"

"మనుష్యులు"

ప్రసాద్ మాటలకి మెల్లగా నవ్వి—

"పెద్ద జోక్ వేశావ్.... నేనడిగింది 'మానవ పదార్థాల్ని' గురించికాదు.... ప్రకృతి అందాల గురించి...."

"వున్నాయి...."

"ఏమిటి?"

"నిండుగా పరవళ్ళుతొక్కే గోదావరి...."

"ఇంకా...."

"నిశ్శబ్దంగావుండే కొండమీది కోవెల ..."

"ఇంకా...."

"పచ్చని కొబ్బరితోటలు, వెన్నెల్లో అందంగా మెరిసే చేల్లుచేలు...." అని ఆగి—

"ఎలాగు చూడబోతున్నావుగా కంగారెందుకు?" అన్నాడు ప్రసాద్.

వివేకానంద కాస్త కోపంగా—

"అసలీవూరు రావడాన్కి కారణం వీడు...." అన్నాడు తిలక్ కేసి వేలు చూపెడ్తూ—

తిలక్ మెల్లగా నవ్వి వూరుకున్నాడు.

తనకి నమ్మకం లేదు. కానీ ప్రసాద్ మరీ బలవంతపెడ్తే కదిలాడు. అంతే.

మనిషి యంత్రంగా మారి, ప్రతీది డబ్బు కోణంలోంచి చూస్తూ, ఒక రకమైన 'రొటీన్ జీవితాన్ని' గడుపుతున్న ఈ రోజుల్లో—

ప్రేమా, ఆప్యాయత, అనురాగం వున్నాయా ఎక్కడైనా ?

"మనుష్యులలో ఇంకా ప్రేమవుంది...." అన్నాడు ప్రసాద్ ఆ రోజు.

"లేదు." అన్నాడతను.

"నీ జీవితంలో ప్రపంచంలో ఒకవైపునే చూశావు.... దీన్ని మించిన మరో అందమైన ప్రపంచముంది...." అన్నాడు ప్రసాద్.

తనేమి మాట్లాడలేదు.

తనతోవస్తే 'మరో ప్రపంచాన్ని' చూపెడ్తానన్నాడు ప్రసాద్.

తను కదిలాడు.

తన చిన్న జీవితానుభవాలు చెప్పిన చేదునిజం.... .... ఈ ప్రపంచంలో మనుష్యులు లేరు.

అంతా మృగాలే !

తనకి లక్షల ఆస్తివుంది. చిన్నప్పటినుండి దరిద్రమంటే ఎరుగడు.... తన తండ్రి పెద్ద బిజినెస్ మాగ్నెట్.... క్షణం తీరిక వుండదు ఆయనకి—

తల్లి....!

తన అందం చెడిపోతుందని, కన్నకొడుక్కి పోతపాలు పోయించిన 'మహాతల్లి' ఆమె—

తనకి తల్లిప్రేమ తెలీదు.... తండ్రిప్రేమ తెలీదు.... 'ఆయా' ప్రేమ తెలుసు.... ఆ ప్రేమ ఇచ్చేజీతం స్థాయిని మించేది కాదు.

లక్షలు ఆర్జించడంలో తండ్రి—

మహిళామండలి గొడవలలో తల్లి, తనగురించి పట్టించుకోలేదు.

తను పుట్టాడు— పెరిగాడు— అంతే !

ఏ మాత్రం మనుష్యుల అభిమానానికి నోచుకోలేదు. కాలేజీలో చాలా మంది మిత్రులుండేవారు. వారంతా తనచుట్టూ ఎందుకుచేరేరో తనకి తెలుసు.

తనని చూసికాదు వాళ్ళంతా తనకి మిత్రులయ్యింది ... తను ఓ పెద్ద బిజినెస్మ్యాన్ కొడుకు.... ఏ క్షణంలో ఏ అవసరం వస్తుందోనని దగ్గరకి చేరారు.

తిలక్ అభిప్రాయాలకి, అనుభవాలకి తోడు— సమాజమనే 'పత్రికలలో' కన్పించే వార్తలొకటే— హత్యలు, దోపిడీలు.

దానవత్వం కరాళనృత్యం చేస్తోంది అడుగడుగునా—

.... .... .... ....

తిలక్ లో నాటుకుపోయిన "అభిప్రాయం" మరింత బలపడింది. అతని దృష్టిలో ఈ ప్రపంచంలో మనుష్యులు లేరు.... అంతా నరరూపరాక్షసులు.

.... .... ....

ప్రసాద్, వివేకానంద, మూర్తి ఎమ్.ఏ. లో తన క్లాస్మేట్స్. ఒకరోజు ఏదో సందర్భంలో తన అనుభవం చెప్పిన చేదు అభిప్రాయం చెప్తే—

"నో!.... నేనొప్పుకోను...." ఈ ప్రపంచంలో యింకా ప్రేమా, అభిమానం.... మంచీ, నీతీ వున్నాయి...." అన్నాడు ప్రసాద్.

"నాకు నమ్మకంలేదు."

"నాకుంది నమ్మకం.... ఈ ప్రపంచం మొత్తం నాశనమైపోతున్న క్షణంలో కూడా ఇన్ని కోట్ల మందిలో కనీసం ఒక్కరైనా కనీసం ఒక క్షణమైనా నశించిపోతున్న 'మానవత' కోసం విలపిస్తారు...."

"ఈరొటీన్ ప్రపంచంలో అది అసాధ్యం...."

"డియర్ ఫ్రెండ్ .. .... నీ జీవితంలో ప్రపంచాన్ని ఒకే వైపునుండి చూశావ్.... ఈ హడావిడి.... ఈ గందరగోళం.... ఇదేకాదు ప్రపంచం.... దీన్ని మించినది.... ప్రశాంతంగా నిశ్శబ్దంగా వుండి, ప్రేమాప్యాయతలతో విలసిల్లే మరో ప్రపంచం వుంది...."

... .... ....

మెల్లగా నవ్వుకున్నాడు తిలక్.

ఇంకా,

ఈ బిజినెస్ వరల్డ్ లో, ఈ మెటీరియలిస్టిక్ ప్రపంచంలో ప్రేమా ? ఆప్యాయతా ?

మంచీ ? నీతా ?

* * * * *

వూళ్ళోకి ప్రవేశించారు నలుగురు.

దూరంగా.... కొండమీద కోవెల స్వాగతం చెప్తున్నట్టుంది.

ఏదో పెళ్ళి వూరేగింపు సాగిపోతోంది. మంగళవాద్యాలు విన్పిస్తున్నాయి.

పెళ్ళికొడుకుని, పెళ్ళికూతురిని పల్లకీలో వూరేగిస్తున్నారు.

నునుసిగ్గు దొంతరలతో కొత్తపెళ్ళి కూతురి మోము.

పల్లకిముందు సన్నాయి మేళం. వెనుక కొందరు నడుస్తున్నారు.

తెలుగువారి సంస్కృతికి ప్రతిబింబమయిన పల్లకిని చూసేసరికి మూర్తి గుండెలలో ఏదో ఆనందానుభూతి....

శరీరం పులకరించిపోయింది. ..

చిన్నప్పుడెప్పుడో—

మామయ్య పెళ్ళికి పల్లకి చూసినట్టు గుర్తు.

మళ్ళీ ఇన్నాళ్ళకి—

"ప్రణయ పల్లకి పల్లకీ—
ప్రనవశర వసంత వల్లిక పల్లకీ—
శక్రచాప వక్రరేఖ పల్లకీ—
మధుస్వప్న శాఖ పల్లకీ—

ఆ వీధి మలుపు తిరిగేవరకు పల్లకినే చూస్తూ నడక కొనసాగించారు—

ఆ వూరి ప్రెసిడెంట్ ప్రసాదు మామయ్య. ప్రసాద్ వాళ్ళనిచూసి—

"రండిరా! రండి... ముందుగా వుత్తరమ్ముక్క రాస్తే, స్టేషన్‌కి బండి పంపించేవాణ్ణిగా...." అంటూ సాదరంగా ఆహ్వానించాడు ప్రసాద్ మామయ్య రఘురామయ్య.

"అనుకోకుండా బయలుదేరామ్ మామయ్యా...." అన్నాడు ప్రసాద్.

"....అమ్మా, నాన్న, చెల్లాయి క్షేమంగా వున్నారా ?"

"క్షేమమే మామయ్యా...." అని ఆగి—

"వీళ్ళంతా నా మిత్రులు.... తిలక్, మూర్తి, వివేకానంద...." అంటూ పరిచయం చేశాడు మిత్రుల్ని.

"నమస్కారమండి...." అన్నారు వాళ్ళు.

"నమస్కారం.... ఇక్కడ మీకు కావలసినన్ని రోజులు వుండొచ్చు.... మీయిల్లే అనుకోండి...." అని—

"ఉమా... కాస్త నీళ్ళు తీసుకురా...." అంటూ గట్టిగా కేకవేశాడు అరుగు మీదనుండి. ఆయన దంతధావన కానిస్తున్నాడు.

మొదట అందంగా గజ్జెల శబ్దం విన్పించి, తరువాత సింహద్వారం నుండి ఓరకంట బైటకిచూచి, విచిత్రంగా కళ్ళని తిప్పుతూ, చూపులతోనే ప్రసాద్‌ని పలకరించి, తండ్రికి నీళ్ళు అందించింది ఉమ.

"మామయ్యకి రెండు మైనస్సులు, రెండు ప్లస్‌లు" అని ప్రసాద్ ఏవో మాటల సందర్భంలో చెప్పిన విషయం గుర్తొచ్చింది మూర్తికి.

"....యిక్కడే నిలబడిపోయారేమిట్రా.... లోపలికి వెళ్ళండి.... ఉమా.... ఆ సావిడ పక్కనవున్న గదిదగ్గరకు తీసుకెళ్ళు...." అన్నాడు రఘురామయ్య.

పాతకాలంనాటి యిల్లు. పెద్దపెద్ద అరుగులు. ఎత్తైన సింహద్వారం. సింహద్వారానికి ఎదురుగా పెద్ద గ్రూప్‌ఫోటో. అటు గోడకి ఏవో ఫోటోలు క్యాలెండర్లు. ఇటువైపు గోడకి గంటల గడియారం. లోపలికి అడుగు పెడ్తుంటే గొప్ప 'థ్రిల్' గా వుంది మూర్తికి. తెలియని వారింటికి వచ్చినట్టు లేదు. యిదివరకు తాతయ్య బ్రతికున్నప్పుడు, తాతయ్యగారింటికి వచ్చినట్టు వుంది.

వాతావరణం ప్రశాంతంగా వుంది.

ఎక్కడినుండో లీలగా మురళీగానం విన్పిస్తోంది.

"....ఏమిటే మనింట్లో ఎవరైనా సంగీత సాధన చేస్తున్నారా....?" అని ప్రశ్నించాడు ప్రసాద్ ఉమని.

ఆమె నవ్వబోయి, బలవంతాన్న పెదవిచివర్న నవ్వుని బిగపట్టి—

"....మనింట్లో అంత 'ఇది' కూడానా....?.... వైద్యనాథన్‌గారు వాయిస్తున్నారు...." అంది.

"వైద్యనాథనా ?.... ఎవరాయన ?"

"....ఈ మధ్యే తమిళదేశం నుండి వచ్చారు.... రోజూ సుప్రభాతం దగ్గరనుండి రాత్రి జోలపాట వరకూ వాయిస్తారు...." అని అక్కడ్నుంచి కదిలింది.

రెండు నిముషాల తరువాత—

"ఒరేయ్ మొద్దులు... నిద్ర లేవండ్రా... ప్రసాద్ వాళ్ళు వచ్చారు..." అని విన్పించాయి ఉమ మాటలు.

"...ఏరా ప్రసాద్ బాగున్నావా....?.... వుత్తరం కూడా రాయికుండా వచ్చావ్... అమ్మా, నాన్న, అంతా కులాసాయేనా..." అంటూ పలకరించింది సీతమ్మ. అంతా క్షేమమే అన్నట్టు తలూపి మిత్రుల్ని పరిచయం చేశాడు.

"....చూడండి నాయినా.... మీరిక్కడేమీ మొహమాట పడక్కర్లేదు.... ఏది కావాలన్నా అడగండి.... ఓసేయ్ ఉమా ఆ వెధవలు యిద్దరూ నిద్ర లేచారా?... ఏదో కొత్త వాళ్ళింటికి వచ్చామనుకోకండి... ఏమండీ... ఆ పాలేరు వస్తే తోటలోంచి ఓ అరటిగెల తెప్పించండి.... ఏమనుకోకండి నాయినా.... మిమ్మల్ని పేర్లతోనే పిలుస్తాను..... ఆ రాజుగారికి చెప్పి ఇంకో శేరు పాలు తెప్పించండి... వస్తాను నాయినా... అవతల పనుంది..." అంటూ అక్కడ్నుంచి కదిలింది సీతమ్మ.

ఆవిడ మాటలకి, హడావిడికి మెల్లగా నవ్వుకున్నారు అంతా.

"...ఒరేయ్ ప్రసాద్... ఎలా వున్నావురా..." అంటూ వచ్చాడు శివం. రఘురామయ్య పెద్దకొడుకు.

"...బానే వున్నా... రామం గాడేడ్రా ?..." అని ప్రశ్నించాడు ప్రసాద్. రామం, శివం తమ్ముడు.

"నీకు తెలీదు కానీ... ఈ మధ్యవాడు సుద్ద బద్ధకం గాడయిపోయాడు... ఆమధ్య తిరునాళ్ళలో రంగులరాట్నం ఎక్కి దానిమీద నిద్రపోయాడు......" అన్నాడు.

వాడిమాటలకి నవ్వాపుకోలేక పోయారు.

ఒకళ్ళ తరువాత ఒకళ్ళొచ్చి పలకరించడం...

విచిత్రంగా అన్పిస్తోంది తిలక్ కి !

స్నానాలు గట్రా కానిచ్చేసరికి, భోజనం సిద్ధంగా వుంది.

భోజనాలు కానిచ్చేసరికి ప్రయాణ బడలిక వలన ఆవలింతలు మొదలయ్యాయి...!

మెల్లగా గదికొచ్చి నిద్ర పోయారంతా.


భోజనాల లోపల మూర్తి, తిలక్, వివేకానందులకు తెలిసిన విషయాలేమిటంటే —

రఘురామయ్య ప్రసాద్‌కి స్వయాన మేనమామ. ఆయన భార్య సీతమ్మ. వాళ్ళకి ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరు మగపిల్లలు. పెద్దమ్మాయికి పెళ్ళిచేసి అత్తారింటికి పంపించారు. రెండో అమ్మాయి ఉమ. టెన్త్ వరకు చదివి మానేసింది. ఆడ సంతానం తరువాత మగ సంతానం. పెద్దవాడు శివం ప్రస్తుతం పదోక్లాసు చదువుతున్నాడు. రెండోవాడు రామం ఏడోక్లాసు.

మూర్తి ఆనందానికి అవధులు లేవు.

చాలా రోజుల తరువాత "నిండుగా" వున్న ఇంటికి వచ్చినట్టుంది. వివేకానందకి—

ఉమని చూసిన క్షణంనుండి ఏదో మధురమైన అనుభూతి.... ఒక మంది



స్నేహితురాలిని చూసినట్టుంది.

తిలక్ కి.

ఏదో విచిత్రానుభూతి....

అంతా కొత్తగావున్నా... ఏదో చనువు!

* * * * *

తిలక్ లేచేసరికి, గుమ్మానికి ఎదురుగావున్న సావిట్లోని గోడగడియారం ఐదున్నర చూపెడ్తోంది...

గది నిశ్శబ్దంగా వుంది. ఎవరూలేరు.

వైద్యనాథన్‌గారి మురళీనాదం విన్పిస్తోంది.

మెల్లగా బావివున్న వైపు అడుగులు వేశాడు.

మొహం కడుక్కొని, తల దువ్వుకొని—

అరుగుమీదికి వచ్చాడు.

"....రా.... రా.... నీ గురించే ఎదురు చూస్తున్నాం.... అలా తోటకేసి వెళ్ళొద్దామా?... ఇందాకా నిద్రలో వున్నావని లేపలేదు..." అన్నాడు ప్రసాద్.

మూర్తి ఏదో పుస్తకం చదువుతున్నాడు. వివేకానంద కూడా అక్కడే వున్నాడు.

"కదలరా... ఇప్పటికే ఆలస్యమయ్యింది..." అన్నాడు ప్రసాద్, మూర్తి కేసి చూస్తూ—

"... ఇదిగో చివరకొచ్చేసింది... చివరి పేజీ చివరి పేరా..." అన్నాడు మూర్తి.

".....అబ్బా..... ఇంత పుస్తకాల పురుగుకింద తయారయ్యా వేమిట్రా నాయినా.... బొత్తిగా యిరవైనాలుగు గంటలూ పుస్తకాలే...." అన్నాడు విసుగ్గా వివేకానంద.

"...నీకేం తెలుసురా... పుస్తకాలు చదవడంలో గొప్ప అనుభూతివుంది... ఎక్కడో ఓ మహానుభావుడంటాడు..... పుస్తకాన్ని తింటూ ఆ పురుగు అనుకుంటుంది "ఆహా! ఇంత రుచికరమైన పదార్థాన్ని తినలేని మానవజన్మ—ఏం జన్మని?"

వివేకానంద ఏమీ మాట్లాడలేదు.

మరో పావుగంట తరువాత మిత్రులంతా తోటకేసి బయలుదేరారు. మధ్య దారిలో చాలామంది పలకరించారు ప్రసాద్‌ని.

"వూరి కిటువైపు తోటలు, కోవెల అటువైపు గోదావరి" అని చెప్పాడు ప్రసాద్.

తోట దగ్గరకి చేరారు.

పచ్చని కొబ్బరి తోటది.

పట్నాలలో కనిపించని పచ్చదనం కనిపించే సరికి 'కళ్ళ'కి పునర్జన్మ పొందిన అనుభూతి.

పాలేరు ప్రసాద్‌ని గుర్తుపట్టి... 'రండి బాబు... రండి' అన్నాడు.

తోట మధ్యలో నులకమంచం వేసివుంది.

దానిమీద కూర్చున్నారు చుట్టూచూస్తూ—

లేగదూడ 'అంబా' అని అరుస్తోంది దూరంగా—

చెట్లకి పిచ్చుకగూళ్ళు వేలాడుతున్నాయి—

చిరుగాలి కెరటాల తాకిడికి పచ్చని ఆకులు మెల్లగా కదుల్తున్నాయి.

సిందూరపు కాంతితో ఆకాశం...

ఆకాశంలో తరలిపోయే పక్షుల గుంపులు...

ఏవో సందేశాలు మోసుకుపోతూ మేఘమాలికలు...

ప్రకృతి సంధ్యారాగం ఆలపిస్తోంది...

లేతగాలి స్పర్శకి శరీరాలు పులకించి పోతున్నాయి.....

మరో పది నిముషాల తరువాత పాలేరు కొబ్బరి బోండాలు తీసుకు వచ్చాడు—

బోండాలని కొడవలిలాంటి దాన్తో కోస్తూ—

కోసిన బోండాలని "మిత్రులకి" అందిస్తూ—

దూరంగా ఆకాశంలోకి తృప్తిగా చూస్తూ—

"...సూడండి బాబుగోరు... మీ పట్నంలో ఇటాంటి అందమైన సాయింకాలం సూశారా...?" అన్నాడు స్వేచ్ఛా గాలులు పీలుస్తూ—

వాడి ప్రశ్నకి ఏమని జవాబు చెప్పాలో అర్థం కాలేదు. నిజమే! పట్నాల్లో ఇంత స్వచ్ఛమైన అందంకూడానా? ఓ అరగంట అక్కడవుంది-

తిరుగు ముఖం పట్టారు నీలి చీకట్లు ప్రపంచాన్ని అలుముకుంటుంటే అప్పుడే మెరుస్తున్న చిన్ని తారల్ని చూస్తూ—

ఆ రోజురాత్రి—

చాలా సేపటి వరకు నిద్ర పట్టలేదు తిలక్‌కి!

కిటికీలోంచి వెన్నెలని చూస్తూ—

ఆకాశంలో నక్షత్రాల్ని లెక్కబెడుతూ—

ఆ రోజు ప్రొద్దుటినుండి జరిగినది నెమరు వేసుకున్నాడు..... రైలు దిగడం... మంచులో నడక... మెల్లగా సాగిపోతున్న ఒంటెద్దుబండి... నన్నాయి మేళం... పల్లకి... పెద్దపెద్ద అరుగులు..... సీతమ్మగారి హడావిడి.... శివం కొంటె మాటలు... వైద్యనాథన్ మురళీనాదం... సాయింత్రం... పచ్చని తోట... తోటలో మిత్రులతో... పాలేరు వేసిన ప్రశ్న... సంధ్యానమయం... తిరిగి వస్తూన్నప్పుడు రెల్లుచేలదగ్గర మూర్తి పాడినపాట... "ఆకులో ఆకునై... పువ్వులో పువ్వునై..."

చాలా సేపటికి పట్టింది అతనికి నిద్ర...!

* * * * *

మర్నాడు—

"డియర్ ఫ్రెండ్స్... ఇవాళ మనం పక్కవూర్లో "ఒకళ్ళింటికి" వెళ్ళబోతున్నాం... "వాళ్ళింటికి" అని ప్రత్యేకంగా ఎందుకు చెప్తున్నానో మీకు తరువాత అర్థం అవుతుంది..." అన్నాడు ప్రసాద్.

మిత్రులంతా తెమిలేసరికి మరో అరగంట పట్టింది.

శివంకూడా వాళ్ళతోపాటే బయలుదేరాడు బడి ఎగ్గొట్టి—

సాహెబ్ గుర్రపుబండి సిద్ధంగావుంది.

అందరూ బయలు దేరారు.

ఈ వూరునుండి పక్క వూరుకి దాదాపు మూడుమైళ్ళ దూరం.

గుర్రపుబండిలో ప్రయాణం పట్నాలలో పుట్టిపెరిగిన వివేకానంద, తిలక్‌లకి కొత్తగా వుంది.

మూర్తికి తాతయ్య ఒళ్ళో కూర్చొని గుర్రపు బండిలో పక్కవూరు "జాతర" కెళ్ళిన సంఘటన జ్ఞాపకానికొచ్చింది.

ప్రసాద్‌కి మామూలే... శివం బండిలో వాగుతోనే వున్నాడు వసపిట్టలా...

వూరి పొలిమేరలలో చిన్న దేవాలయముంది.

"ఏమి సేతురాలింగా... నేనేమి సేతురాలింగా..." దేవాలయం మైక్రోఫోనులోంచి విన్పిస్తోంది.

చిన్న వూరది.

చెరువుగట్టు మీంచి వెళ్తోంది గుర్రపుబండి... చెరువులో నీళ్ళు సూర్య కాంతికి తళతళ మెరుస్తున్నాయి... కలువలు... తామరాకుల మీది నీటిబొట్లు ముత్యాల్లా మెరుస్తున్నాయి...

చెరువు గట్టునవున్న రావిచెట్టుక్రింద ఎవరో నలుగురు కూర్చొని మాట్లాడు కుంటున్నారు...

"నేడే చూడండి... పద్మశ్రీ టూరింగ్ టాకీసులో... గొప్ప పౌరాణిక చిత్రం...'రామాయణం'... తప్పక చూడండి..." సినిమాబండి వెళ్తోంది...

మరో ఐదు నిముషాల తరువాత ఓ యింటిముందు ఆగింది బండి. దిగారు అంతా.

"ఎవరూ?" అంటూ కళ్ళజోడు సవరించుకొని చూశాడొకాయన, అరుగు మీద పడక కుర్చీలో కూర్చొని వున్నాడాయన. విశాలమైన నుదురు. నుదుటన విబూది రేఖలు. విబూది రేఖలమధ్యలో కుంకుమ. పచ్చని శరీరం... వయస్సు అరవై వుండొచ్చు.

"నేను మేష్టారు... ప్రసాద్‌ని!" అని సమాధానమిచ్చాడు ప్రసాద్.

"ప్రసాదా?" గుర్తు తెచ్చుకోవడాన్కి ప్రయత్నిస్తున్నా డాయన.

"అదే మేష్టారు... పక్కవూరు సాంబన్నగారి మనవడ్ని..." అన్నాడు ప్రసాద్.

ఆయన క్షణం మౌనంగా వుండి, తరువాత గుర్తు తెచ్చుకున్నట్టు —

"...ఓహో... నువ్వా... రా... రా... వయస్సు పెరిగిపోయి... కళ్ళు సరిగ్గా అనట్లేదు... ఏమిటీ ఈ మధ్య కన్పించడం లేదు... ఇటు వైపు రావడంలేదా..." అని ప్రశ్నించాడు.

"లేదు మేష్టారూ... ఎప్పుడొచ్చినా హడావిడిగా వచ్చి వెళ్ళడమే అవు తోంది..." అన్నాడు ప్రసాద్.

"...ఒసేయ్... అన్నపూర్ణా... రా!... రా!... పిల్లలొచ్చారు..." అని కేకవేశా డాయన,

లోపల్నుండి ఓ పండు ముత్తయిదువ వచ్చింది.

ప్రసాద్ వాళ్ళని చూసి... తెగ సంబర పడిపోయింది.

కాలం గడిచినట్టే తెలీకుండా... సాయింత్రం అయిపోయింది. భోజనాలకి వెళ్ళిపోతామన్నా, బలవంతాన్న ఆపుచేశారు. వయస్సులో ఎంతో తేడ మున్నా, తమ నవ్వులో నవ్వుతూ, తమతో కేరింతలు కొడుతూ, ఉత్సాహంగా తమతో కలిసిపోయి మిత్రుల్లా ప్రవర్తించిన ఆ దంపతుల్ని చూసి ఆశ్చర్య పోయారు ముగ్గురూ -


చిన్నప్పుడు ఆయన ప్రసాద్‌కి చదువు చెప్పారు... ప్రస్తుతం రిటైర్ అయి ఖాళీగా వున్నారు...

బయలుదేరి వెళ్ళిపోతున్నప్పుడు ప్రసాద్‌తో ఆయన -

"ఏమిటోరా ప్రసాద్...ఈ మధ్య పిల్లల దగ్గరనుండి వుత్తరాలు రావడం లేదు... రోజూ పోస్టాఫీసుకి వెళ్ళడం... నిరాశగా వెనక్కి తిరిగిరావడం...

"ఎందుకు మేష్టారూ మీరు రావడం... నేనే వస్తే తెచ్చి యిస్తాగా" అంటాడనుకో పోస్ట్‌మేష్టారు... కానీ... ఏమిటోరా... వయస్సు సహకరించక పోయినా... మనస్సు వూరట ఆగదు... ఆతృత తగ్గదు... ఏ హృదయాన్ని చూసినా... పిల్లల దగ్గరనుండి... పక్షుల్లా రెక్కలు కట్టుకొని వుత్తరాలు వస్తాయేమోనని ఆశ... రిటైర్ అయ్యాకా... ఇలాగే గడుపుతున్నాననుకో... ఒక్క ఉత్తరం వస్తే చాలు... అది పదిసార్లు తక్కువ కాకుండా చదువుతాము. వుత్తరాన్ని చూసేసరికి అన్నపూర్ణ కూడా ఎంత సంతోషిస్తుందనుకున్నావ్..." అంటూ చెప్పుకుపోయా రాయన కళ్ళలో తిరిగిన కన్నీళ్ళని బుజమ్మీది కండువాతో తుడుచుకుంటూ -

## నా గురించి



పూర్తి పేరు: అకెళ్ల వెంకట వ్యాఘ్ర సాంబశివప్రసాద.

పుట్టిన తేది: 7-9-1965.

చదువు: ఈ ఏడాదే బి. కాం. ప్యాసయ్యాను

అమ్మా, నాన్న: సుభద్ర, లక్ష్మీ నారాయణగార్లు.

చెల్లెలు: రాజ్యలక్ష్మి.

అన్నయ్య 'మూర్తి రాజా' ప్రోత్సాహంతో దాదాపు రెండేళ్లనుండి రచనలు చేస్తున్నాను. ఇప్పటివరకు దాదాపు ఇరవై రచనలు ప్రచురింపబడ్డాయి. కొన్ని రచనలు 'అకెళ్ల శివప్రసాద్' పేరుతో వ్రాశాను. ఆంధ్రభూమి మాసపత్రిక, యోజన పత్రికలలో కథలకి బహుమతులు వచ్చాయి. సాధన సాహితి సమితి' వారు నిర్వహించిన కథల పోటీలో 'ఆచార్య తిరుమల'గారి అవార్డు వచ్చింది. నా మొదటి కథ 1980 లో ప్రచురింపబడింది. 1984 నుండి తరుచు రచనలు చేస్తున్నాను.

'ఒక ఝరిలాంటి అనుభూతి 'నది'ని రాయమని ప్రేరేపిస్తే 'నది నవలగా మార్చడాన్కి కష్టపడవలసి వచ్చింది. నవల్లో 'మూర్తి' పాత్రకి తగట్టు ప్రముఖుల కొటేషన్లు వుపయోగించడం జరిగింది. వారికి కృతజ్ఞతలు.

నవల రాయడం ఇదే మొదటిసారి. మొదటి నవలకే బహుమతి యిచ్చినందుకు 'భారతి' వారికి కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాను. మొదటి నవల కనుక ఏవైనా తప్పులుంటే విజ్ఞులైన పాఠకులు, విమర్శకులు మన్నించండి.

—ఎ. వి. వి. యస్. యస్. ప్రసాద్.

అన్నపూర్ణమ్మగారి స్థితీ అంతే... చాలా కాలం తరువాత వచ్చిన ప్రసాద్‌ని వాళ్ళని వదలబుద్ధి కావడంలేదు.

బండి కదిలింది.

బండి వీధిమలుపు తిరిగే వరకు చుస్తోనే వున్నారు ఆ దంపతులు.

వూరి పొలిమేర్లు దాటింది బండి.

అప్పటివరకు మౌనంగావున్న తిలక్ ప్రశ్నించాడు.

"ఎంత మందిరా... మేష్టారుకి పిల్లలు...?" అని -

ప్రసాద్ మెల్లగా నవ్వి -

"నీకో గొప్ప నిజం చెప్పనా?" అన్నాడు.

ఏమిటన్నట్టు చూశారు మిగిలిన వాళ్ళుకూడా.

గుర్రం చకచకా పరుగులు తీస్తోంది.

"...నిజానికి ఆయనకి పిల్లలు లేరు..."

"అంటే?" అర్థం కానట్టు అడిగాడు వివేకానంద.

"ఆయన దగ్గర చదువుకున్నవాళ్ళే ఆయన పిల్లలు... వాళ్ళదగ్గరనుండే తరచు వుత్తరాలు వస్తుంటాయి..." అని క్షణం ఆగి -

"మీకు గుర్తుందా...? నేను ప్రతి నెల మొదటివారం, మూడోవారం తప్పనిసరిగా వుత్తరం రాయడం... నేను వ్రాసేది మేష్టారుకే..." అన్నాడు ప్రసాద్.

తిలక్ ముఖంలో స్పష్టంగా మార్పు కన్పించింది.

చిన్న షాపలాంటిది తగిలిందతనికి.

"తమ స్వంత బిడ్డల్నే సరిగ్గాచూడని ఈ కాలంలో... వేరేవాళ్ళ పిల్లల్ని తమ స్వంత బిడ్డల్లా చూసుకొనే వారున్నారా ?" "వున్నారు !" అనుకున్నాడు నిశ్చయంగా తిలక్.

అందరి హృదయాలలో ఎవరో పరిచయంలేని వాళ్ళింటికి వెళ్ళినట్టులేదు.

ఏదో 'పుణ్యక్షేత్రాన్ని' దర్శించిన అనుభూతి.

* * * * *

కొండమీద కోవెల ప్రశాంతంగా వుంది.

నిశ్శబ్దం గీసిన చిత్రంలావుంది వాతావరణం !

అలయ ప్రాంగణంలో గడ్డిపూలు భగవంతుని పిలుపుకోసం ఆశగా ఎదురు చూస్తున్నాయి...!

ధ్వజస్తంభపు గంటలు గాలి అలల తాకిడికి మెల్లగా మ్రోగుతున్నాయి...

కొండమీంచి చూస్తే వూరంతా కనిపిస్తోంది.

కోవెల వున్న కొండ చుట్టుపక్కల పచ్చదనంతో కొబ్బరిచెట్లు...

పూల తోటలు... పంట పొలాలు...

దేముడికోసం తపస్సు చేస్తున్న ఋషుల్లా కదలకుండా వృక్షాలు...

ఎటుచూసినా హరితవర్ణ సౌందర్యము...

ఆటుపక్క...

పరవళ్ళు తొక్కుతూ గోదావరి గంభీరంగా హుందాగా...!

దూరంగా... సంధ్యకెంపులో మెరుస్తూ సూర్యుడు.

గూళ్ళకి చేరుకుంటున్న పక్షులు...

"ప్రకృతి గీసిన సౌందర్య చిత్రంలా వుంది పల్లెంతా -!

అప్పుడే ఎవరో భక్తులు వచ్చినట్టున్నారు. గంటల శబ్దం మెల్లగా విన్పిస్తోంది.

"అద్భుతం... ప్రపంచంలోని అందాలన్నీ కళ్ళముందు సాక్షాత్కరించినట్టుంది..." అన్నాడు మూర్తి. అతని కళ్ళలో నీళ్ళు ముత్యాల్లా.

"ఈ ప్రపంచంలో ఇంత నిశ్శబ్దం వుందని... ఆ నిశ్శబ్దంలో ఇంత అందమూ, ఆనందము వున్నాయని ఇన్నాళ్ళకి తెలిసింది..." అన్నాడు వివేకానంద.

తిలక్ ఏమీ మాట్లాడలేదు.

దూరంగా ఆకాశంలో ఏదో అన్వేషిస్తూ సాగిపోయే పక్షుల్లా వున్నాయి అతని చూపులు.

"...నిజానికి నా దృష్టిలో... దేముడు వున్నాడా ? లేడా ?... అన్నది అప్రస్తుతం...కానీ...గుడికి రావడం మాత్రం ఒక మధురమైన అనుభూతి..." అన్నాడు ప్రసాద్.

ప్రశాంత నిశ్శబ్దం...

గంట తరువాత అక్కడ్నుంచి కదిలారు.

సిరిచీకట్లు అలుము కుంటున్నాయి. కొండదిగుతూ మెల్లగా అనుకున్నాడు తనలో తాను తిలక్ -

"నిశ్శబ్దమా ! నీకు నా జోహార్లు"

* * * * *

"మీవూరు నాకు బాగా నచ్చిందండి....అన్నాడు వివేకానంద ఉమతో.

వచ్చినప్పటినుండి ఆమెతో మాట్లాడాలని ఎదురు చూస్తున్నాడు. కానీ అవకాశం దొరకలేదు. ఇవాళ పొద్దునే తిలక్, మూర్తి, ప్రసాద్ తోటకేసి వెళ్ళారు.

తనని రమ్మన్నారు కానీ....కాస్త తలనొప్పిగా వుండడంవల్ల వెళ్ళలేదు. ఉమ ఏదో అల్లుతోంది.

వైద్యనాథన్ మురళీగానం విన్పిస్తోంది.

"ఎందుకు?" అని ప్రశ్నించింది ఆమె.

"....ఈ ప్రశాంతత....ఈ నిశ్శబ్దం....యివి పట్నంలో (భూతద్దం) పెట్టి వెతికినా దొరకవు....ఎప్పుడూ హడావిడే....పొద్దున్న లేచింది మొదలు.... ...ఉరకలు పరుగులు....క్షణం తీరికవుండదు....ఏదో పని ఎప్పుడూ. జస్ట్ రొటీన్‌గా సాగిపోతుంది జీవితం...." అన్నాడు వివేకానంద.

ఆమె క్షణం మౌనంగా వుంది —

"........ఏమో బాబు....మీకు ఆనందంగా హాయిగా వుండొచ్చు....కానీ మాకు సుద్ద బోరు...."

ఆమె మాటలకి ఆశ్చర్యపోయాడు వివేకానంద.

ఈ హాయి, ఈ ప్రశాంతం, ఈ నిశ్శబ్దం బోరా?

"...ఓ నెల పట్నంలో వుంచే మీరామాట అనరు...."

"...ఓ నెల ఇక్కడ వుంచే మీరూ ఆమాట అనరు........" అందామె మెల్లగా నవ్వుతూ—

"మీకో విషయం చెప్పనా?....నేను పుట్టింది, పెరిగింది పట్నంలోనే.... కానీ—ఇక్కడకొచ్చిన ఈ రెండు రోజుల్లో అనుభవించిన 'థ్రిల్" ఎప్పుడూ అనుభవించలేదు....నిజానికి....అది"థ్రిల్" కాదు.....ఏదో చెప్పలేని ఆనందం లాంటింది...."

"మరో రెండు రోజులువుంటే మీకే తెలుస్తుంది...."

"ఈవూరు....ఈపూలతోటలు....పంట పొలాలు.... దూరంగా స్పష్టంగా కన్పించే సూర్యోదయం....సూర్యాస్తమయం.... నిశ్శబ్దాన్ని సంతరించుకున్న కొండమీది కోవెల....అడుగడుగున స్వచ్ఛత....పచ్చదనం...."

"... ఏమ్ స్వచ్ఛతండీ....ఎప్పుడూ అవే చెట్లు....అవే ఆకులు....అదే సూర్యోదయము....అస్తమయము....ఇక కొండ మీది కోవెలంటారా?....కొండ నెక్కేసరికే వున్న శక్తంతా పోతుంది. నిశ్శబ్దంలో మీరు రాగాలు విన్పించేయేమో కానీ....నిశ్శబ్దాన్ని భరించడం కష్టం...."అందామె.

ఒకే 'స్థితిలో' యిద్దరూ....అనుభూతులు సమాంతరరేఖలు. మళ్ళీ ఆమె అంది—

'అప్పుడప్పుడు ...పట్నంకేసి వెళ్ళినప్పుడు అన్పిస్తుంది.... ఈ సందట్లో నలుగురితో కలిసి పోతూవుండిపోతే బాగుంటుందని అలా కలిసి మసలడంలో ఆనందం వుంది. ...."

"మీ మాటలు వింటుంటే నాకొకటి గుర్తొస్తోంది." అన్నాడు వివేకానంద.

"ఏమిటి?"

"దూరపు కొండలు నునుపు....'

"....కరెక్ట్....నేనూ ఆ మాటే అందామనుకున్నా యిందాకా...."అని నవ్వి—

"....కానీ....ఒకటి మాత్రం ఖచ్చితంగా చెప్పగలను....'అంది

ఏమిటన్నట్టు చూశాడు వివేకానంద.

"ఈ ప్రపంచంలో ప్రస్తుతం చాలామంది....హడావిడికి. పరుగుకి అలవాటు పడిపోవడం వలన....నిశ్శబ్దానికి చాలా దూరంగా వుండడంవల్ల.... ఒక్క మాటలో చెప్పాలంటే "ఒకరకమైన రొటీన్ జీవితాన్ని' గడుపుతుండడంవల్ల.... " దొరకని ప్రశాంతతని పొందే ప్రయత్నంలో.... ...కొద్దిపాటి

ప్రశాంతత లభించినా కొండంత సంతోష పడ్తున్నారు...." అందామె. ఆమె మాటలకి మరోసారి ఆశ్చర్య పోయాడు వివేకానంద.

'హ్యూమన్ బి హేవియర్ " గురించి అంత స్పష్టంగా చెప్పినామె. అతని కళ్ళకి ఒక పెద్ద "సోషల్ సైంటిస్టు'లా కన్పించింది.

"....ఇంకా ఈ ప్రపంచంలో మంచి వుందంటారా?" చాలా సీరియస్‌గా అడిగాడు నిముషం తరువాత—

ఆమె వూహించని ప్రశ్న.

రెండు క్షణాలు నిశ్శబ్దం. లోపల్నించి సీతమ్మ కేక వినబడింది.

"చూసే కళ్ళని బట్టి....?అని—

"....వస్తానండి....అమ్మ పిలుస్తోంది....' అని అక్కడ్నుంచి కదిలింది తన ప్రశ్నకి, ఆమె సమాధానం విని—

తను వేయవలసిన ప్రశ్న 'అది' కాదు అనుకున్నాడు వివేకానంద. తను వేయవలసిన ప్రశ్న—

"....మంచి వుంది ...కానీ దాన్ని చూసే కళ్ళెన్ని?'

మర్నాడు—

ప్రొద్దునే నిర్ణయించు కున్నారు.

ఈరోజు ఎలాగైనా గోదారి తీరానికి వెళ్ళాలని—

రోజూ గోదారి తీరానికి వెళ్దామని బయలు దేరడం....ఏదో అనుకొని ఆటంకం ఏర్పడి....మానేయడం జరుగుతోంది. సాయంత్రం ఐదు అవుతుందనగా బయలు దేరారు నలుగురు. శివం యింట్లోవుంటే వస్తానని పేచీ పెట్టేవాడే కానీ....వాడు పక్కవూరు సంతకెళ్ళాడు. రామం బడినుంచి వచ్చి నిద్రపోయాడు. గోదావరి తీరం చేరేసరికి దాదాపు అరగంట పట్టింది గోదావరి గట్టుకానుకొని పెద్ద మర్రిచెట్టుంది. చెట్టు క్రింద చిన్న గుడి లాంటిది వుంది.

గోదావరి పరవళ్ళు తొక్కుతూ, నిండుగా, గంభీరంగా, హుందాగా వుంది.



మెల్లగా గట్టుని తాకుతున్న అలలు....

దూరంగా. మెల్లగా సాగిపోతున్న తెరచాప పడవ....

లీలగా విన్పిస్తోంది పల్లెవాడి గుండె గొంతులోంచి కదలి, కదలి వస్తున్న పల్లె పదం....

'లంకలోకి వెడ్దామా?" అడిగాడు ప్రసాద్.

"లంకా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు వివేకానంద. అతనికి పూరంతా కొత్తగా వుంది.

....అదిగో....అ దూరంగా....గోదారి అవతల కన్పిస్తోంది చూశావా? అదే లంక....'

' అటు ఎలా వెళ్ళడం?"

' పడవమీద ....'

"ఇక్కడ పడవలాంటిది లేదుగా........" అన్నాడు గోదారి కేసి చూస్తూ వివేకానంద.

' మరో అరగంటికి....పడవ యిటువైపు వస్తుంది."

" పడవెందుకు వస్తుంది? "

' సాయంత్రం....ఆరవుతుంటే పడవవాడు ఓసారి గట్టుదాకా వస్తాడు.." అన్నాడు ప్రసాద్.

"ఎందుకొస్తాడు?" వివేకానంద వేసిన ప్రశ్నకి విసుగ్గా చూశాడు మూర్తి.

'.. ఈ చుట్టు పక్కలవున్న వూళ్ళకి ఈ వూరు మధ్యలో వుంది.... గోదారితీరం కూడ దీనికే వుంది....బస్సు దొరకని వాళ్ళు....ముఖ్యంగా కూలీ నాలీ జనం....పడవమీద గోదారిదాటి....లంకలోంచి నడుచుకు వెళ్ళిపోతుంటారు.....' అన్నాడు ప్రసాద్.

పడవకేసే చూస్తున్నారు అంతా—

మరికొద్ది సేపటికి—

తెరచాప పడవ మెల్లగా గట్టుకేసి వస్తోంది...

పల్లెపదం మరీ దగ్గరగా వస్తోంది.

పావుగంట తరువాత—

గట్టుచేరుకుంది పడవ....పడవలో యిద్దరున్నారు....ఒక ముసలతను ... మరో కుర్రాడు.

' దండాలుబాబు....లంకలోకి కానీ యెళ్ళాలేంటి?" అని అడిగాడు పడవ తాత.

"అఁ....అఁ...." అన్నాడు ప్రసాద్.



పడవ ఎక్కారందరూ—

మెల్లగా అలలని తోసుకుంటూ కదిలింది పడవ—

'యాస'లో పల్లెపదం అందుకున్నాడు పడవ తాత.

' గంగమ్మ తల్లికి చెంగల్వ పూదండ

కాళిందికీ తెల్ల కల్వదండ....' అని —

ఆపదం అర్థం: గంగమ్మ తల్లి, కాళింది, గోదారితల్లి, సరస్వతిదేవి, కృష్ణవేణమ్మ, కావేరీ.... అందరు తల్లుల్లారా.... పిల్లల్ని పాపల్ని చల్లగా రక్షించి. క్షేమంగా ఇల్లు చేర్చండి అని.

అలలమీద ఉయ్యాలలా వూగుతోంది పడవ...

పడవ కదలికకి—

పడవ తాత పల్లె పదానికి—

శీత గాలుల స్పర్శకి—

గుండెల్లో ఏదో పులకరింత!

పరవశం! ఆనందం!

" కొండగాలి తిరిగింది....గుండె వూసు లాడింది....

గోదావరి వరదలాగా కోరిక చెలరేగింది...."

మూర్తి పాటని ప్రతిసారీ విసుక్కునే వాళ్ళకి ఆక్షణంలో ఆ పాట—

మూర్తి గొంతుకూడా బాగుంటుంది అన్పించింది.

మెల్లగా లంక దగ్గర ఆగింది పడవ.

"....ఏమిటీ వాతావరణం ఇలా వుంది....వాన కానీ పడదుగా?' అన్నాడు అనుమానంగా ప్రసాద్ ఆకాశంకేసి చూస్తూ—

ఆకాశం మేఘావృతమై వుంది.

"....వెధవ... అపశకునపక్షి ....ఏమిటా అకూతలు?" అన్నాడు కోపంగా మూర్తి. అతనికీవాతావరణం బాగా నచ్చింది.

అందరూ దిగారు పడవలోంచి—

ప్రసాద్ డబ్బులు యివ్వబోతే, తీసుకోలేదు పడవతాత. 'మరోసారి యిద్దరుగానిలెండి బాబు' అని తన దారిని తాను వెళ్ళిపోయాడు. కుర్రవాడికి పడవ కట్టి రమ్మనిచెప్పి—

మెల్లగా నడక ప్రారంభించారు నలుగురూ—

లంకంతా ఏవో గడ్డిపూలు....పిచ్చి మొక్కలు....

పచ్చిగడ్డిమీద నుండి పిల్లగాలి కెరటాలుగా వీస్తోంది....

సన్నని బాట....

మెల్లగా నడుస్తున్నారు....

" లంక కటువైపు చేరుకున్నాకా, కన్పించే దారిలోంచి మెల్లగా నడుచుకుంటూ వెళితే....మళ్ళీ మనవూరి పొలిమేరలు వస్తాయి...." అన్నాడు ప్రసాద్. ఉత్సాహంగా నడుస్తూ—

మెల్లగా లేత చీకట్లు అలుముకుంటున్నాయి....

నక్షత్రాలు వస్తున్న ఛాయలు ఎక్కడా కన్పించడంలేదు....

ఆకాశమంతా మేఘాలు....

చెట్ల పక్కలనుంచి, చిన్న చిన్న మొక్కలని తొక్కుకుంటూ నడుస్తున్న మిత్రులమీద మెల్లగా చినుకులు పడడం ప్రారంభించాయి.

మరో పది నిముషాల తరువాత...

చిరుజల్లు....!

ఆకాశంనుండి భూమికి ఏదో వర్తమానం తీసుకు వస్తున్నట్టు కురుస్తోంది వాన....

గడ్డిపూలమీద పడి చినుకులు "ఆనంద నాట్యం" చేస్తున్నాయి. నల్లని మబ్బుల చాటున బంగారు తీగెలా మెరిసే మెరుపు....

వచ్చేటప్పుడు వాతావరణం బానేవుంది గదాని గొడుగులు ఏమి తీసుకు రాలేదు....

ఇప్పుడెలా ?

చుట్టూ చూశారు.

భూమి ఆకాశం ఏకమైనట్టు కురుస్తోంది వాన....

నడకలో వేగం హెచ్చించారు...

చలిలో....

చలికి వణుకుతూ....

వానలో తడుస్తూ....

నడవడం కొత్తగావున్నా, శరీరాలు గజగజ వణుకుతున్నాయి.

'....అదిగో....అక్కడేదో కన్పిస్తోంది ... " అన్నాడు చుట్టూ చూస్తున్న మూర్తి, అటువైపు వేలు చూపెడ్తూ—

దూరంగా....

చినుకుల చాటున....

పర్ణశాలలావుందో....గుడిసె?

అటువైపు అడుగులు వేయిడం ప్రారంభించారు.

ఐదు నిముషాల తరువాత అక్కడికి చేరారు.

పెద్ద గుడిసె....

గుడిసె తలుపు దగ్గరగా వేసివుంది....

చూరు క్రిందకి చేరారు....వానని చూస్తూ—

చినుకులు చిందులు వేస్తున్నాయి.

" నేను ముందే అన్నాగా ....వానొస్తుందేమోనని...." అన్నాడు ప్రసాద్.

ఎవరూ మాట్లాడలేదు క్షణం—

చినుకుల శబ్దం స్పష్టంగా విన్పిస్తోంది—

"చాలా విచిత్రంగా వుంది యిదంతా....కలా? నిజమా? అనే అనుమానం వస్తోంది...."అన్నాడు వివేకానంద.

" నాకూ అంతే....మనం గోదారికి బయలుదేరడమేంటి?.... పడవ మీద ప్రయాణం చేసి లంక చేరడమేంటి? లంకలో చూస్తుండగానే వానేంటి? " అన్నాడు ఆశ్చర్యంగా మూర్తి.

'.... నా జీవితంలోకూడా ఇదే మొదటిసారి....లంకకొచ్చినప్పుడు వాన పడడం.... అన్నాడు ప్రసాద్.

" ...చిరుజల్లు వడ్తుంటే గొప్ప హాయిగావుందిరా...." అన్నాడు మూర్తి.

మూర్తి మాటలకి అడ్డువడుతూ—

'....చిరుజల్లు పడ్తుంటే గొప్ప హాయిలేదు... హాయి వుందను కోవడంలో ఆనందం వుంది." అన్నాడు వివేకానంద.

వివేకానంద మాటలని విననట్టు—

'....అవునా....ఈ క్షణంలో కొండమీది కోవెలలోవుంటే ఎలా వుంటుం దంటావ్ ? అన్నాడు మూర్తి, విచిత్రంగా కళ్ళని తిప్పుతూ—

"....చూడు నాయనా మూర్తి....ప్రస్తుతం మనమున్నది లంకలో. కోవెల దగ్గరకాదు..." అని నవ్వబోయి ఆగిపోయాడు వివేకానంద, గుడిసెలోంచి ఏదో అలికిడి విన్పించే సరికి—

"...ఎవరైనా వున్నారేమో గుడిసెలో..." అన్నాడు మూర్తి.

'....ఎవరుంటే మన కెందుకురా....వాన తగ్గాక మనం వెళ్ళిపోదాం....' అన్నాడు ప్రసాద్.

వాన క్రమేణా పెరుగుతోంది.

చూరు క్రింద నుంచున్నా చినుకులు పడ్తున్నాయి....

ఇంతలో—

'మీరాబాబు? అన్న కంఠం విన్పించింది.

గుమ్మంవైపు చూశారు. పడవ తాత.

" ...ఎంత సేపని వానలో తడుస్తారు....లోనికి రండి బాబు' అన్నాడు,

పడవతాత వంటిమీద చిన్న పంచెతప్ప ఏమీ లేదు. ముడతలు పడిన శరీరం చలికి వణుకుతోంది. వణకడం వల్ల వాడి చెవికున్న వెండిపోగు అందంగా కదుల్తోంది.

చలికి కంఠంకూడా వణుకుతోంది.

పడవతాత మరీ దగ్గరగా రావడంవల్ల....స్పష్టంగా కన్పిస్తున్నాయి. అతని కళ్ళ దగ్గర. నుదుటిమీద జీవితపు అనుభవపు తాలుకు గీతలు.

వాడికేసి ఒక క్షణంచూసి—

గుడిసె లోపలికి అడుగుపెట్టారు.

గుడిసెకున్న మట్టిగోడలు మసిబారి వున్నాయి.

గుడిసె మధ్యలో హారికేన్ లాంతర్‌వుంది.... గోడలకి ఒక ప్రక్కగా బట్టలు కుప్పగా పడున్నాయి... మరోపక్క కొన్ని కుండలు. పాత్రలు....

ఇటువైపు చలికి ముడుచుకు పోతూ, రగ్గులాంటిది కప్పుకొని ఓ స్త్రీమూర్తి.


తెల్లమచ్చలు

కొత్త పరిశోధన! తెల్లమచ్చలు, ఇతర చర్మవ్యాధులు వున్నవాళ్ళు బాధపడనవసరం లేదు. అట్టివారి వివరాలు ఇంగ్లీషులో తెలిపి రెండు చిన్నసీసాల మందు వుచితంగా పొందండి. మా మందు వాడడ మీరు ప్రారంభించగానే మీ తెల్లమచ్చలు మాయమవడ ప్రారంభమగును చాలామంది ఈ విధమైన నివారణ పొందారు. మీరూ ప్రయత్నించి లాభం పొందండి. అర్హతలు, అనుభవం వున్న వైద్యునిద్వారా చికిత్స పొందండి

తెల్లవెంట్రుకలు

హేర్ డైతో కాదు. మా ఆయుర్వేద నూనెతో చిన్న వయస్సులో వెంట్రుకలు తెల్లపడడం ఆటంకపర్చవచ్చును. మొదలునుండే నల్ల జుట్టు రావడం మొదలై, జుట్టుని తెల్లపడనీయకుండా కాపాడును. ఈ నూనె కళ్ళకి, మెదడునకు లాభదాయకమైనది వేలమంది లాభం పొందారు. ఈ చికిత్సద్వారా మీకు ఫలితం దక్కనిచో మీ డబ్బు వాపస్ ఇవ్వబడును. ఒకసారి ప్రయత్నించండి. ఒక చిన్నసీసా వెల రూ॥ 14/- మూడు సీసాల వెల రూ॥ 40/- మూడు సీసాలకి ఒకేసారి ఆర్డర్ యిస్తే ఒకసీసా ఉచితం.

**Hind Ayurved Bhavan (B.H. 3)**
**P.O. Karti Sarai (GAYA) India.**

దీపపు వెలుతురులో ఆమె కళ్ళు మెరుస్తున్నాయి....నుదుటన రూపాయి కాసంత ఎర్రటిబొట్టు. మనిషి నల్లగావున్నా....ఏదో గొప్ప ఆకర్షణ వుంది ఆమెలో....!

పడవ తాతతో పడవలో కన్పించిన కుర్రాడు కన్పించలేదు ఎక్కడా-

పడవతాతని మూర్తి మరీబలవంతపెడ్తే మరో పల్లెపదం అందుకున్నాడు.

' తొలకరి ఒక మబ్బు తొంగి చూచింది
మబ్బులో ఒక మెరుపు మెరిసి పోయింది."

పదం విని రగ్గులాంటిది కప్పుకొన్నామె కిలకిల నవ్వింది. ఎందుకంటే ప్రియుడి కోసం విలపిస్తూ ప్రేయసి పాడే పదమది.

పడవతాత తనూ హాయిగా నవ్వుకొని—

పదం కొన సాగించాడు.

' పెరటిలో ఒకజల్లు కురిసి వెలిసింది
జల్లులో నా మనస్సు జారిపోయింది"

వానచినుకుల శబ్దం వాడి పదానికి నేపథ్య సంగీతంలా వుంది. మూర్తి పాట వినడంలో నిమగ్నుడై పోయాడు.

ప్రసాద్ గుడిసె అంతా పరీక్షగా చూస్తున్నాడు.

వివేకానంద గుమ్మంలోంచి బైటికి చూస్తున్నాడు ...

తిలక్ ....

ఆమెకేసే చూస్తున్నాడు....

ఆమె ఆల్చిప్పల్లాంటి కళ్ళు మిలమిల మెరుస్తున్నాయి.

ఆమెకూడా తిలక్ కేసి ఓరకంట చూస్తోంది.

ఎంతోకాలం నుండి పరిచమున్న మనిషిలా కన్పిస్తోంది

ఆమె తిలక్ కళ్ళకి—

వానతగ్గు ముఖం పట్టింది—

"....పదండిబాబు ...గట్టు వరుకు దిగబెడతా...." అంటూ లేచాడు పదా లాపి—

"....రంగీ లేవే....ఆ దీపం పట్టుకొని నాతోరా....' అన్నాడు ఆమె కేసి చూస్తూ

ఆమె మెల్లగా లేచింది. రగ్గు కప్పుకొని, లాంతరు పట్టుకొని వాళ్ళతో పాటు కదిలింది.

చల్లగాలులు వీస్తున్నాయి.

చీకటి....

చంద్రకాంతి లేదు....

నక్షత్రాలు అక్కడక్కడ మిణుక్కు మిణుక్కు మంటున్నాయి. వానలో తడిసిన మట్టి వాసన పచ్చగడ్డి మీద నుండి వస్తోంది. అలవాటులేని దారి మూలాన్న కొస్త కష్ట పడ్తున్నారు నలుగురు- అలవాటుగా నడుస్తున్నారు, పడవతాత, రంగి.

పడవ కదిలింది....

తెరచాప మెల్లగా వూగుతోంది.

అలలు వురకలు వేస్తున్నాయి.

పడవకటు చివర లాంతరు పట్టుకొని ఆమె....

ఇటు చివర తిలక్

పదహారణాల పరువంలో వుందామె

వయస్సు తెచ్చిన అందాల కన్నా ఏదో ఆకర్షణ వుందామెలో.

గట్టు దగ్గర దిగి—

యింటికి చేరేసరికి—

రఘురామయ్య వాళ్ళు కంగారు పడ్తున్నారు.

రఘురామయ్య వాళ్ళకి జరిగిన విషయం వివరంగా చెప్పి, రాత్రి పన్నెండవుతుండే నిద్రకువక్రమించారు.

తిలక్ మనస్సులో—

ఆమె రూపం !

ఆ క్షణం నుండి —

ఆ క్షణంనుండి కాదు....ఆమెని చూసిన క్షణం నుండే తిలక్ జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమయ్యింది!

* * * * *

మర్నాడు—

వుదయం అందరూ లేచేసరికి ఏడు దాటింది.

రోజూ

నాల్గు ఇళ్ళ అవతల నుండి—

లీలగా—

అందంగా—

విన్పించే వైద్యనాథన్‌గారి మురళీగానం విన్పించడం లేదు. అలవాటుగా చేస్తున్న పని ఏదో చేయనట్టు అన్పించింది.

మొదటిరోజు—

(ప్రసాద్ వాళ్ళు వచ్చిన మొదటి రోజు)—

అస్తమానూ మురళీగానం విన్పించే సరికి విసుగు అన్పించినా—

రెండో రోజునుండి....

అది అలవాటుగా మారి పోయింది!

జీవన నిత్య కృత్యాల్లో అది (మురళీగానం) ఒకటిగా మారిపోయింది.

సుప్రభాతం వింటూ లేవడం అలవాటు....

అలాంటిది ఈరోజు మురళీగానం విన్పించడం లేదు.

"ఏమే ఉమా....ఏమిటీవాళ మురళీగానం విన్పించడం లేదు....' అని అడిగాడు కాఫీ తీసుకొచ్చిన ఉమని ప్రసాద్.

ఆమె క్షణం ఏమీ మాట్లాడలేదు.

తరువాత—

మెల్లగా—

' నిన్నరాత్రి మీరు వచ్చేసరికి ఆలస్యమయినందువల్ల మీకు తెలీలేదు....

" ఏమిటి!" ఆత్రంగా అడిగాడు ప్రసాద్.

మిగిలిన ముగ్గురూకూడా ఆమెవైపు ఏమిటన్నట్టు చూశారు.

ఆమె మెల్లగా నిట్టూర్చి—

" పాపం.... నిన్న సాయంత్రం మీరు వెళ్ళాక, ఆనందభైరవి ఆలపిస్తూ.... ఆలాపనలోనే అంతిమ యాత్ర సాగించారు...' అంది విషాదంగా.

గుండెలు చివుక్కుమన్నాయి అందరికీ.

తమకు ఏ మాత్రం పరిచయంలేని వ్యక్తి కోసం మొదటిసారిగా బాధ పడ్డారు అందరూ—

మౌనంగా రెండు కన్నీటి బొట్లు చెక్కిలిమీంచి జారి పోయాయి.

' ఒక్కసారిగా గుండె ఎందుకు గిలగిలలాడి పోయింది?' అని ప్రశ్నించుకున్నాడు తిలక్.

" తను మనిషి కనుక!' మనసిచ్చిన జవాబు.

మూర్తి విషాదంగా అన్నాడు—

' నువ్వులేవు నీ పాట వుంది: ఇంటి ముందు జూకామల్లె తీగల్లో అల్లుకొని లాంతరు నన్నని వెలుతురులో క్రమ్ముకొని నా గుండెల్లో చుట్టుకొని గాలిలో ఆకాశంలో నక్షత్రం చివరి మెరుపులో దాక్కొని నిరనంగా నిజంగా వుంది. "

* * * * *

వారం రోజులు దాటింది అప్పటికే వాళ్ళువచ్చి—

ఆ రోజు

గోదారి గట్టుకి బయలు దేరారు....

అంతకు ముందు ఓ రెండుసార్లు వెళ్ళారు....!

ఆ రెండు సార్లు....

'తృప్తి'గా పడవ ప్రయాణం చేశారు....!

ఓ సారి లంకంతా నడుచుకు వెళ్ళారు....!

మరోసారి—

లంకలో కాసేపు తిరిగి వచ్చారు....,

ఈ రెండు సార్లు పడవతాత ద్వారా తెలిసిన విషయాలు ఏమిటంటే-

పడవతాత చాలా కాలం నుండి పడవ నడుపు తున్నాడు....వాడి తండ్రి వాడి కిచ్చిన ఆస్తి ఆ పడవా....ఆ గుడిసె....అప్పుడప్పుడు—

పండగలకి, పర్వ దినాలకి, తిరునాళ్ళకి చుట్టు పక్కల వూళ్ళల్లో గుళ్ళో బాజా వాయిస్తుంటాడు.... వాడికో కొడుకు.....కొడుకు కూతురే రంగి.... ఓ సారి పుష్కరాల్లో పడవలో జనం ఎక్కువయి....అది తిరగబడడం వల్ల.. ప్రవాహంతొనహా కొడుకు కొట్టుకు పోయాడు....!

భర్త పోయిన కొన్నాళ్ళకే భార్యకూడా పోయింది.

అప్పటికి రంగి నెలల పసికందు.

"....నా నంటి పాపా. నాకంటి పాపారంగి...వాడు 'మా బాబువున్నాడు' అనే ధైర్యంతో దీన్ని నాకు ఒగ్గేసినాడు....నా పేణంలో పేణం బాబు....బాబూ మునలోడు ఏందో కూత్తునాడను కోకండి... దాని కన్నీళ్ళు నావి బాబు.... వాని బాదలు నావి బాబు.... ఈ సుకాలు, నా ఆనందాలు అన్ని దానివిబాబు. ఈ సేతుల్తో గోదారమ్మ నన్ను పెంచింది.... నా సేతుల్తో నాను "రంగి"ని పెంచినానుబాబు...." అన్నాడోసారి పడవ తాత.

మరోసారి—

"..... నా సిట్టి తల్లి.... జెళ్ళో కొండ మల్లెలు తురుముకొని, కళ్ళనిండా కాటుక దిద్దుకొని, బుగ్గన సిన్న సుక్కయెట్టుకొని....ఇంత...రూపాయికాసంత కుంకుమ దిద్దుకొని.... మెరిసేటి పూసలపేరు ఏసుకొని, పచ్చటి నేల మీంచి వస్తుంటే....సీమహాలక్ష్మి కళ్ళముందు కదిలి వస్తున్నట్టుంటుంది." అన్నాడు. కళ్ళలో కదిలిన కన్నీటి చుక్కల్ని తుడుచుకుంటూ—

ఆ రోజు—

గోదారి గట్టు చేరేసరికి పడవ సిద్దంగా వుంది.

పడవ మీద రంగి కూడా వుంది.

పడవ కదిలింది.

చాలా అందంగా వుంది రంగి.

'నాగమల్లి పూలతో నల్లని జడ నవ్వుతోంది.

పరవళ్ళ గోదావరిలా నిండుగా వుంది రంగి.

చేపల్లాంటి కళ్ళకి కాటుక-

పల్లకిలా వంగిన కనుబొమలు-

కాళ్ళకి వెండి కడియాలు-

అందంగా, పొందిగ్గావున్న అవయవ సౌష్టవం.

పడవ కటువైపు కూర్చుంది రంగి.

దూరంగా...

సూర్యాస్తమయం.

పక్షుల గుంపులు.

నీలి మేఘాలు సాగిపోతున్నాయి.

గాలి కెరటాల అలికిడి - !

అలల........ ఒరవడి - !

"....ఈ వయసులో యింకా ఏం కష్టపడతావ్ తాతా....?"

మిగిలిన వాళ్ళు ఆశ్చర్యపోయారు.

ఎవ్వరూ—

నిశ్శబ్దంగా వుండే తిలక్ వేసిన ప్రశ్న అది.

పడవ తాత ఓక్షణం మౌనంగావుండి, తెరచాప కేసి, 'కళ్ళైత్తి' చూసి-

"....యిది పెద్ద కట్టమా బాబు.... అయినా యింకెంత కాలం బాబు ?.... ....ఈ'సిన్నారి'ని ఓ అయ్యి సేతిలో పెడ్తే.... ఇక ఏ కట్టాలు వుండవు బాబు.... అయినా నువ్వే సెప్పు బాబు ?.... బిడ్డని సాకడం తల్లికి కట్టమా బాబు ?...."

చివరి మాట తిలక్ హృదయంలో ఎక్కడ తగలాలో

అక్కడ తగిలింది.

ఏమీ మాట్లాడ లేక పోయాడు.

చిరు చీకట్లు లోకాన్ని అలుముకుంటున్నాయ్....

పడవ లంక వైపు వెళ్తుంటే....

"....ఇవాళ లంకకేసి వద్దు తాతా !........ కాసేపు ఈ గోదారిలోనే తిరుగుదాం...." అన్నాడు ప్రసాద్.

పడవ దిక్కు మార్చాడు.

గంటకు పైగా గోదారిలో—

అటు నుండి ఇటు—

ఇటు నుండి అటు—

తిప్పారు పడవని !

మూర్తి పడవలో అటూ ఇటూ తిరుగుతూ, ఆకాశం కేసి, అలల కేసి, చూస్తూ.... మధురానుభూతిని అనుభవిస్తున్నాడు....!

వివేకానంద ఏదో ఆలోచిస్తున్నాడు.

అతని కళ్ళముందు ఆ రోజు వరకు జరిగిన సంఘటనలు



కదుల్తున్నాయి.

ప్రసాద్‌కూడా ఏదో ఆలోచిస్తున్నాడు....

తిలక్....

తిలక్ మాత్రం....

రంగికేసి చూస్తూనే వున్నాడు ...!

రంగి కూడా అలలకేసి—

ఆకాశం కేసి చూస్తున్నట్టుగా —

కన్పిస్తున్నా, ఓరకంట తిలక్‌కేసి చూస్తోంది....!

ఆమె గుండెల్లో ఎన్నో భావాల పరవళ్ళు....

అతని గుండెల్లో అనురాగరస ఝరులు....

కళ్ళు....

కళ్ళు పలకరించుకుంటున్నాయి....!

ఆమె మెల్లిగా నవ్వితే—

అతని గుండెల్లో పువ్వుల పరిమళం!

ఆమె 'చిలిపి'గా చూస్తే—

అతని మనస్సులో ప్రేమ జల్లు కురిసినట్టు—

'పలుకు'లేని పలుకరింత కళ్ళది!

మాటలులేని మానసవీణ మూగది!

కళ్ళు కబుర్లు చెప్పుకుంటున్నాయి!

ఎదలోయల్లో అనురాగ స్వరాలు పలుకుతున్నాయి!

మనస్సును మించిన భాష లేదు!

గుండెను మించిన లిపి లేదు!

నిశ్శబ్దాన్ని మించిన 'రాయిబారి' లేదు!

పిల్ల గాలులు—

ఒక గుండె నుండి—

మరొక గుండెకి—

వర్తమానాన్ని తీసుకు వెళ్తున్నాయి....!

పడవ గట్టు చేరింది.

గుండెల్లో ఏదో బరువు.

అందరూ పడవ దిగారు.

పడవ వెనక్కి మళ్ళింది—

నలుగురు....

గట్టుమీద నిలబడి పోయారు....!

"....తాతా! తాతా!" గట్టిగా పిల్చాడు ప్రసాద్.

వెనక్కి చూశాడు పడవ తాత.

రమ్మన్నట్టు సైగ చేశాడు ప్రసాద్.

పడవ మళ్ళీ గట్టుచేరింది.

"....ఇదిగో తాతా.... యీ డబ్బుంచు...." అంటూ పర్స్‌లోంచి పదిరూపాయలు తీసాడు ప్రసాద్.

"వుంచండి బాబు.... యిప్పుడేం తొందర...." అన్నాడు పడవ తాత. ప్రతిరోజూ అతను అలాగే అంటున్నాడు.

"లేదు.... తాతా.... రేపట్నుంచి మేము రాము" ఒక కఠోర నిజాన్ని చెప్తున్నట్టు వణికాయి అతని పెదవులు.

మాటల్లో వణుకు లాంటి ధ్వని.

క్షణ కాలం ఏమీ మాట్లాడలేదు పడవ తాత.

రంగి కళ్ళలో ఏదో మార్పు—?

క్షణం తరువాత పదిరూపాయలు తిరిగి యిచ్చేస్తూ—

"....వద్దుబాబు... రోజూ ఒకళ్ళిద్దరు వస్తుంటారు.... అందరూ కేవలం పడవ మీద అగట్టు నుండి ఈగట్టుకి చేర్చే వాడిలా సూస్తారేకానీ....ఎవరూ.... యింత 'యిదిగా' నాతో 'కలిసిపోరు'.... నల్లని నదీ తీరంలో ఓ ముసిలోడు, ఓ పడవ నడుపుకుంటాడు అని గుర్తుంచుకొండి బాబు... అదేసాలు... నాకు పెద పెద 'బాసలు'రావు బాబు... నాను పెద్దగా సదువుకోలేదు బాబు... కానీ... ఒక విసయం సెప్తాను బాబు... యెర్రిబాగులోడు యెదో సెబుతున్నాడను కోకండి... మంచిగా బతకండి బాబు... మారాజుల్లా బతకండి...." అంటూ వెళ్లేశాడు పడవ తాత.

పడవ మెల్లగా కదిలింది.

అది నిశ్చలంగా నిర్మలంగా సాగిపోతోంది.

తెరచాప మెల్లగా వూగుతూ వీడ్కోలు చెప్తోంది.

ఆ రోజు రాత్రి—

కిటికీలోంచి వెన్నెల కన్పిస్తోంది.

తిలక్‌కి నిద్ర పట్టలేదు...

మెల్లగా లేచి...

తలుపు తెరిచి...

ఇల్లు వదిలి...

వెన్నెల్లో నడక ప్రారంభించాడు—

నదీతీరం వైపు....!

వెన్నెల్లో గోదారి—

పాల సముద్రంలా వుంది!

కళ్ళముందు....

ఎన్నో దృశ్యాలు....

జ్ఞాపకాల రూపకాలు....

మొదటిసారిగా గోదారి ఒడ్డుకు రావడం....

తెరచాప పడవ కదలిక....

మెల్లగా వీచిన పిల్లగాలులు...

లంక దగ్గర లంగరేసిన పడవ....

లంకలో నడక....

చుట్టూ పిచ్చి మొక్కలు....

గడ్డి పూలు....

వున్నట్టుండి కమ్మిన మేఘాలు...

చిరుజల్లు చిందులు....

చిన్న వర్షశాలలాంటి గుడిసె....

చూరు క్రింద మిత్రులతో వానలోకి చూస్తూ....

గుడిసె మట్టి గోడలు....

చిన్ని వెలుతురుతో లాంతర్....

పడవ తాత పిలుపు....

రగ్గు లాంటిది కప్పుకున్న రంగి....

చినుకుల శబ్దం....

వర్షే పదం....

కిలకిల నవ్వు రంగిది....

తిరిగి —

చీకటిలో....

వణుకుతూ....

మట్టి వాసన....

ఆలస్యంగా యింటికి చేరడం....

ఒకరోజు

కొప్పులో పువ్వులు....

రూపాయి కాసంత బొట్టు....
రంగి నవ్వు—
తిలక్‌కి అర్థం కాని విషయం మరొకటుంది.
అదేమిటంటే....
ఇవాళ....
గోదారి గట్టు నుండి వస్తున్నప్పుడు...
తన కళ్ళల్లో ఎందుకు తిరిగాయి...
కన్నీళ్ళు ?
గోదారి గట్టు దిగి...
అలలని చేత్తో మెల్లగా తాకి....
వెన్నెల్లో గోదారిని చూస్తూ....
అలలతో అన్నాడు....

"....యు రిమెమ్బర్ మీ యాజ్ ఏ లింక్ ఆఫ్ యువర్ మెమోరీస్ చైన్.....!" అని !

* * * * *

మర్నాడు....
సాయంత్రమయింది....
ప్రొద్దుటి నుండి సాయింత్రం వరకు ఎలాగడిచిందో తెలీలేదు....
ఒకటే హడావిడి....
సామానుగట్రా సర్దుకొనే సరికి ఐదయ్యింది.
ఎంత వద్దన్నా వినకుండా సీతమ్మ పిండి వంటలు చేసింది.
కొసరి కొసరి వడ్డించింది.
రామమయితే ప్రొద్దుటి నుండి ఒక్కటే గొడవ —
ప్రసాద్ వాళ్ళతో వెళ్ళిపోతానని !
శివం కళ్ళలో కూడా—
బాధ తాలూకు భావం స్పష్టంగా అలుముకుంది !
ఉమ....
మనస్సులో ఏమనుకుంటోందో తెలీదు కానీ....

వెళ్ళిపోతారని తెలిసిన క్షణం నుండి ఆమె నవ్విన నవ్వు ఎందుకో 'సజీవంగా' వచ్చినట్టు కన్పించలేదు.... అతికి పెట్టుకున్నట్టుంది...

ఆమె కళ్ళచాటు నీలి నీడలు...! ?

ఉమని చూసే సరికి, ఆమె కళ్ళని, నవ్వుని చూసే సరికి వివేకానంద ఏదో మాటల కందని, పెదవి దాటని బాధ అనుభవిస్తున్నాడు....

(నిజానికి అది బాధ కాదు.)
(ఒక రకమైన నిర్లిప్తత ! ?)
గూడు వీడి ఒక పక్షి ఎగిరిపోతున్నప్పుడు
జంట పక్షి అనుభవించే బాధది.
పూవువాడి పోయేటప్పుడు గిలగిలమనే రెమ్మలా వుంది ఉమ.
మూర్తి.

మూర్తికి తాతయ్య చేయి పట్టుకొని మెల్లగా అడుగులో అడుగువేస్తూ శివాలయానికి వెళ్ళినప్పటి జ్ఞాపకాలు...

మధురమైన స్మృతిలాంటి ఈ అనుభూతి దూరమవుతుంటే....
ఆ బాధని ఓ మహాకవి కలం కన్నా —
సామాన్యుడి గుండె అందంగా చెప్తుంది !
ప్రసాద్...

తన నమ్మకాన్ని మిత్రులు కూడా దాదాపు నమ్మినందుకు తృప్తిగా వుందతనికి...!

తిలక్....
మిగిలిన వారందరికంటె ఎక్కువగా వుంది అతనికి బాధ....


# మీరు పాఠకులా ? అయితే ఇటు చూడండి

**కేవలం పన్నెండు (12-00) రూపాయలతో మీకు సంవత్సరం పాటు నెచ్చెలిగా వుండేందుకు ఒక మాసపత్రికను తీర్చిదిద్దాం – ప్రతి నెలా మిమ్మల్ని అలరిస్తుంది – ఆనంవపరుస్తుంది – విపరీతమైన శీర్షికలుగల తనలో (శ్రీహిత) పాల్గొనేలా చేస్తుంది – ఇంకెందుకు ఆలస్యం ? రండి – ఏఁవిటి ? పన్నెండు రూపాయలు ఏంటి – చిన్న మొత్తం అంటున్నారా ? పాతిక పంపండి – పాతిక నెలలు వస్తుంది గదా ! – ఓ. కె. ఏదైనా మీకే అవకాశం –**

చిరునామా :

ఎడిటర్, శ్రీహిత

3/95, నవాబ్‌పేట, నెల్లూరు – 524002

ఫోన్ : 3330, 6058, 6700

మళ్ళీ....
ఈ నిశ్శబ్దతలోంచీ....
ఈ ప్రశాంతతలోంచీ....
ఈ ఆనందానుభూతిలోంచీ....
ఈ పులకింతలోంచీ....
ఈ మనోహర పరవశంలోంచీ....
ఈ మధురిమల మధురమైన మధురంలోంచీ....
ఈ చల్లని స్వేచ్ఛా గాలులలోంచీ....
ఈ ఆనందలోకంలోంచీ....
మళ్ళీ....
పరుగు వైపు....
హడావిడి వైపు....
రణగొణ ధ్వనులలోకి....
అశాంతిలోకి...
అలజడిలోకి....
గోలగోలగావుండే ప్రపంచంలోకి....
రొటీన్‌గా సాగిపోయే జీవితంలోకి....
ఏ విధమైన....
ప్రేమా....
అభిమానం....
అనురాగం....
లభించని....
అడుగడుగునా....
కృత్రిమతని....
కల్మషాన్ని....
కాలుష్యాన్ని....
కాఠిన్యాన్ని....
కలిగిన....
ప్రపంచంలోకి వెళ్ళాలి....!
అక్కడ....
ప్రేమ వుండదు.
బంధం వుండదు.
మెటీరియలిస్టిక్ లైఫ్.
'రూపాయి' చాటున తండ్రి....
మహిళా మండలి కార్యక్రమాల్లో.... తల్లి....
మళ్ళీ....
అలాంటి వాళ్ళందరిని....
చూడాలి...

వాళ్ళతో కలిసిపోవాలి. ..

వాళ్ళతో జీవించాలి....


డబ్బుకి తప్ప మనిషికీ, మనస్సుకి ఏ మాత్రం విలువ యివ్వని ప్రపంచంలోకి సాగిపోవాలి....

ఒక అందమైన వర్ణ చిత్రం సౌందర్య ప్రతీకగా కళ్ళముందు కదలి....
ఒక స్వప్నంలా జాలిగా కరిగిపోతూ...
హృదయ విదారకంగా విలపిస్తున్నప్పుడు...
వేదనతో చలించి పోయినప్పుడు....
గుండెకోవెల ప్రాంగణంలో విన్పిస్తున్న సప్తస్వరాలు...
గాలి అలల తాకిడికి చెదిరిపోయినప్పుడు...
సాగే గోదారి పరుగు ఆగిపోయినప్పుడు....
కొండల్లోంచీ...
కోనల్లోంచీ....
అప్పటి దాకా ఆనందరాగాలు విన్న ప్రకృతి....
ఆ క్షణం నుండి....
విషాద స్వరాలు విన్నట్టు....
ఒక అనుభూతికి గుండె భాష వుంది కానీ....
గుండె భాషకి అక్షరరూపం లేదు.... !

.... .... .... .... ....

.... .... .... .... ....

మెల్లగా నడక ప్రారంభించారు.
రఘురామయ్య రైల్వేస్టేషన్ వరకు బండి పంపిస్తానన్నాడు గానీ....
సరదాగా నడచి వెళ్దామని...
గంటముందే బయలుదేరారు .... రైల్వేస్టేషన్‌కి:
ఇక్కడ—
ప్రసాద్ ఒకవిషయానికి ఆశ్చర్యపోయాడు—
అదేమిటంటే—
వచ్చేటప్పుడు—
"....ఇలా ఎంతదూరం నడవాలిరా.... మట్టిరోడ్ల మట్టి కొట్టుకుంటూ...."
అన్న వివేకానంద. నడవ డాన్కి ఉత్సాహం చూపాడు.
వీధి చివర కొచ్చారు....
వెనక్కి తిరిగి చూశాడు వివేకానంద....
పెద్ద పెద్ద అరుగులు వున్న పాతకాలం నాటియిల్లు...,
గుమ్మంలో తమకి వీడ్కోలు చెప్తూ రఘురామయ్య కుటుంబం....
ఆటు పక్క....
ఉమ:
దూరంగా కన్పిస్తున్న ........ ఆ కళ్ళల్లో ఏదో ఆర్తి ....
వసంతం కోసం నిరీక్షించే కోయిలలా ఆమె ....
ఆమెని చూసే సరికి—
గిర్రున కళ్ళలో నీళ్ళు తిరిగాయి:
కళ్ళు చెమ్మగిల్లితే మిత్రులు ఎవరైనా చూస్తారేమోనని
కళ్ళలో "ఏదో" పడ్డట్టు కళ్ళుతుడుచుకొని నడక సాగించాడు వివేకానంద.
మూర్తి మాత్రం ఎలా గ్రహించాడో....
ఆకాశం కేసి చూస్తూ —
మెల్లగా అన్నాడు —
"రెప్ప రెప్పని తడిపింది కన్నీటి చుక్క"నీ:
వూరి చివర వరకు ఎవరూ మాట్లాడలేదు.
సన్నని బాట....
పచ్చటి పంట పొలాలు....
హరితవర్ణ సౌందర్యం ....
దూరంగా నీలాకాశంలో—
తరలిపోయే పక్షుల గుంపు మిత్రుల్లా—
వెనక్కి తిరిగి చూస్తే—
మిత్రులకి వీడ్కోలు చెప్తున్నట్టు కొండమీది కోవెల.
సాయంత్రం ప్రశాంతంగా నిశ్శబ్దంగా వుంది....







సూర్యాస్తమయిం....

కళ్ళముందు కరిగిపోతున్న సూర్యుడు....

సిందూరకాంతి....

అడుగులు ముందుకు పడుతున్నాయి కానీ .... మనస్సు మాత్రం పల్లెని వదలడం లేదు.

అప్పటివరకు మధురంగా విన్పించిన ఒక "రసార్ద్రగీతం" స్తంభించి పోయిన అనుభూతి అందరికి!

వసంతం వెళ్ళిపోయి నప్పుడు మౌనంగా రోదించే కోయిల వేదన అది!

రైల్వేస్టేషన్ చేరారు!

మధ్యదారిలో ఎవరూ మాట్లాడలేదు.

అదేమి విచిత్రమో ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడే మూర్తి కూడా మౌనంగా వుండిపోయాడు....

స్టేషన్ అంతా ఖాళీగావుంది....

వేయి నిముషాల తర్వాత—

ఓ విచిత్రమైన సంఘటన జరిగింది!

రామం, శివం, సైకిల్ మీద రొప్పుతూ చేరుకున్నారు స్టేషన్‌కి—

ప్రసాద్ వాళ్ళు బయలుదేరిన పావు గంటకి బయలుదేరారుట—

తోటకెళ్ళి, కొబ్బరి బొండాలు పట్టుకొని, అడ్డదారిన స్టేషన్‌కి వచ్చారుట—

"....ఏమిటోబాబు.... మిమ్మల్ని చూడాలన్పించింది...."

అన్నాడు శివం సిమెంట్ బెంచీ మీద కూర్చుంటూ—

"...మీవూళ్ళో పెద్దపెద్ద రైలు లుంటాయి కదా.... బస్సుమీద బస్సు ఏంచక్కా థలేగావుంటుందేమ్!.... యీసారి నాన్నగారితో పట్నంవెళ్ళాలి ... మళ్ళీ ఎప్పుడొస్తారు!" అని ప్రశ్నించాడు రామం.

వాడి అమాయకమైన మాటలకి.... గుండెలు పులకించి పోతున్నాయి!!

రైలు వచ్చింది.

బోగి ఎక్కుతుంటే—

పెద్ద మనిషిలా "....వెళ్ళంగానే వుత్తరం రాయి...." అన్నాడు శివం.

రైలు కదిలింది.

రామం, శివం చేతులు వూపుతోనే వున్నారు.... చివరి బోగి దూరమయ్యే వరకు—

చిన్నస్టేషన్‌లో.... మెల్లగా చలికి వణుకుతూ.... చేతులు వూపుతున్న ఆ పిల్లల నిర్మలమైన మొహాలు... కళ్ళ ముందు.... కదుల్తోంది అదృశ్యం!

చెట్లు, పుట్టలు వెనక్కి నడుస్తున్నట్టగావుంది రైల్లోంచి చూస్తుంటే—

"ఎలా వుందిరా 'టూర్'?" అడిగాడు ప్రసాద్.

క్షణం మాట్లాడ లేదు ఎవరూ...

గాలి వేగంగా వీస్తోంది....

"ఐలైక్ మీటింగ్ పీపుల్ హూమ్ ఐషల్ నెవర్ మీట్ ఎగైన్" అన్న ఓ మహానుభావుడి మాటల్లో గొప్ప అర్థముంది...." అన్నాడు వివేకానంద.

"నువ్వన్నది అక్షరాలా నిజం... మళ్ళీ జీవితంలో కలవని మనుష్యులతో కలవడంలో ఒక గొప్ప ఆనందముంది..." అన్నాడు ప్రసాద్.

"కొన్ని అనుభూతులు కలల్లా అన్పిస్తాయి.... అలాంటి కలల్లాంటి అనుభూతుల్లో ఇదొకటి...." అన్నాడు వివేకానంద. అతని స్వరంలో కాస్త బాధ.

ఓ నిముషం ఆగి—.

వివేకానందయే అన్నాడు....

"....ఎందుకో చేరువై దూరమవుతారు..." అని, రైలువేగం హెచ్చింది.

కంపార్ట్‌మెంట్‌లో పెద్దగా జనంలేరు.

గాలి గట్టిగా వీస్తోంది!... దూరంగా ఆకాశంలో అప్పుడే కళ్ళుతెరుస్తున్నాయి నక్షత్రాలు....

మేఘాల చాటున దోబూచులాడుతున్నాడు చందమామ.

"...ఇదివరకు .... తాతయ్య బ్రతికున్నప్పుడు.... ప్రతి సంవత్సరం వేసవి సెలవులకి తాతయ్యగారింటికి వెళ్ళేవాణ్ణి.... నా వయస్సు వాళ్ళే కొంత మంది వుండే వాళ్ళు అక్కడ.... మే మంతా కోతీకొమ్మచ్చి, చెడుగుడు ఆడే వాళ్ళం.... చెట్లమ్మట, పొలాల గట్టుల వెంట పరుగులు పెట్టేవాళ్ళం..., చెరువులో ఈదేవాళ్ళం... ... ఆనాటి జ్ఞాపకాలు పునరావృత్తమై నట్టుంది..." అన్నాడుమూర్తి.

లిలక్... క్షణం మాట్లడలేదు.

క్షణం తరువాత—

"ఒక అందమైన స్వప్నం కళ్ళముందు కదిలినట్టుగా కదిలి... చూస్తుండగానే కరిగి పోయినట్టుంది.... అని ఆగి—

"బాధకోసమే పుట్టాను... బాధలోనే పెరిగాను.... కన్నీళ్ళే.. జీవితమంతా కన్నీళ్ళే..." అన్నాడు విషాదంగా.

"అబ్బ... మళ్ళీ ఇదేమిటా?" విసుక్కున్నాడు మూర్తి.

తిలక్‌లో ఏ భావమూలేదు.

"తిలక్! నీకో విషయం తెలుసా?..." అన్నాడు ప్రసాద్.

ఏమిటన్నట్టు చూశాడు తిలక్.

"ఒక మధురమైన జ్ఞాపకం.... ఒక జీవితం సాఫీగాసాగి పోవడాన్కి ఊపిరి... ప్రాణమూ?.."

తిలక్ ఏమీ మాట్లడలేదు.

కొంతసేపు మౌనం తరువాత -

"...ఆవూరిలో.... ఆ గోదారిలో ... ... అలలమీద సాగిపోతున్న పడవలో.... దూరంగా సూర్యాస్తమయం అవుతుంటే... నల్లని వాల్‌జడలో నాగమల్లిపూలు తురుముకొని,.. పున్నమి చందురిడిలా నవ్వుతున్న రంగి నాకళ్ళకి కన్పిస్తోంది..," అన్నాడు తిలక్ కళ్ళుమూసుకుంటూ—

"...మళ్ళీ... ఎప్పుడైనా.... ఈ జీవితంలో... అలాంటి... అనుభూతి కల్గు తుందంటావా?" అన్నాడు విషాదంగా.

"ఎవరో కవి అన్నట్టు "మెనీపీపుల్ ఎంజాయ్ నథింగ్ ఆఫ్ దేర్ హ్యాపీనెస్ బట్ ఫీయర్ ఆఫ్ లాస్టెంగ్ ఇట్" అన్నాడు,,. అలావుంది యిప్పుడు..." అన్నాడు మూర్తి.

తిలక్ మొహంలో ముగ్గురికీ స్పష్టమైన మార్పు కన్పించింది. వున్నట్టుండి అతనిలో ఆవేశం ప్రవేశించింది.

"...నో! ... నాకుకావాలి.... ఆ అనుభూతి శాశ్వతం కావాలి... నా జీవితాంతం మిగిలిపోవాలి.,." అన్నాడు ఆవేశంగా, సూట్‌కేస్ అందుకుంటూ-

"... వచ్చేస్టేషన్‌లో దిగిపోతాను.... మళ్ళీ... ఆ వూరికి... ఆ గోదారి తీరానికి.... ఆ పడవ మీద ప్రయాణం... రంగి..."

అతనిలో కలిగిన "భావసంచలనానికి" షాక్‌తిన్నారు మిత్రులు ముగ్గురూ-

"....వెన్నెల్లో గోదారి అలలకేసి చూస్తూ.... స్వచ్ఛమైన గాలులు పీలుస్తూ... అక్కడే వుండిపోతాను..." ఇంకా ఏదో చెప్పబోతున్నాడు.

తిలక్‌లో కలిగిన "మార్పుకి"... ఆశ్చర్యపోయారు ముగ్గురూ- అతన్ని బలవంతాన్న ఆపుచేసి—

ప్రసాద్ అన్నాడు తిలక్‌తో—

"...ఆణిముత్యాల్లాంటివి అందమైన అనుభూతులు.... అలాంటి ముత్యాల సరమే జీవితం... ఒక అనుభూతిలోంచి మరొక అనుభూతిలోకి మనిషి జీవితం "నది"లా సాగిపోతుండాలి కానీ... ఒక్కచోటే నిశ్చలంగా నిలిచిపోకూడదు.."

తిలక్ ఏమీ మాట్లాడలేదు. మిత్రులందరికి నచ్చేగుణం అదే. మాటకి మాట సమాధానం చెప్దామని చూడడు ఎదుటివాడు చెప్పింది కూడా ఆలోచిస్తాడు.

మరో అరగంట తరువాత అడిగాడు ప్రసాద్‌ని—

"... మళ్ళీ అలాంటి "అనుభవం" ఎదురవుతుందంటావా?" అని ఆశగా.

ప్రసాద్ మెల్లగా నవ్వి -

"...నిరీక్షణలో గొప్పఅందముంది నేస్తం... పట్నం, పల్లెఅని కాకుండా.. నీకు కన్పించిన ప్రతి మనిషిలో అన్వేషించు... తప్పకుండా ఎలాంటి "మనిషి" లోనైనా ఎక్కడోక్కడ ప్రేమా.. ఆప్యాయత కనిస్తుంది.." అన్నాడు ప్రసాద్.

తిలక్ మౌనంగా.... ఏదో ఆలోచిస్తున్నాడు.

ఆరోజు రాత్రి -

ఎక్కడో సూట్‌కేసు అడుగున ఎన్నోరోజుల నుండి ఏమీ రాయకుండా పడున్నడైరీ తీసి-

యిలారాశాడు -

"అనుభూతిలోంచి అనుభూతిలోకి "నది"లా సాగిపోయేదే జీవితం..."

దానికిృందే ఇలా కూడారాశాడు -

"...చల్లని పిల్లగాలులు... వెన్నెల్లో నదీతీరం... ... అలల మీద సాగిపోతున్న తెరచాప పడవ... గంభీరముద్రని దాల్చిన గోదావరి.... తరలిపోతున్న పక్షుల గుంపులు... సందేశాలుమోసుకుపోతున్న మేఘ మాలికలు... నిర్మలమైన నీలాకాశం... అప్పుడే కళ్ళు తెరుస్తున్న చిన్న నక్షత్రం... ప్రతి రెమ్మా... ప్రతికొమ్మా... ప్రతిపూవు... యింకా... యింకా.... ప్రకృతి సమస్తం.... మనిషిలో "ఇంకా అక్కడక్కడా" మిగిలివున్న మానవత్వం... నన్ను మనిషిగా మార్చాయి! స్తబ్దతతో వున్న నాకు, నిశబ్దంలో కొత్త రాగాలు మధురంగా విన్పించాయి—

నాకు "కొత్త ప్రపంచాన్ని" పరిచయం చేశాయి—

"ప్రవాహం లాంటి ఈ అనుభూతి నా జీవితాన్ని "నది"గా మార్చింది"-

అనుభూతిలోంచి, అనుభూతిలోకి సాగిపోతూ, "మనిషి" గానే మిగిలిపోనీ భగవాన్!"

[అయిపోయింది]


తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగు చేసేందుకు గాను మా మందు కనిపెట్టబడింది చికిత్సను సమక పూర్తిగా పొందుతే మచ్చల రంగు మారి శరీరానికి మునుపటి రంగు తిరిగి వస్తుంది. జబ్బు మొదళ్ళలో నుండి కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారణకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతో సహా జబ్బు పూర్తి వివరాలను వ్రాయండి.

దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోనై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనందభరితమైన సుఖాన్ని అనుభవించ లేక పోతున్నారా...అయితే రహస్యమైన మీ జబ్బు యొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలో గల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టుకు డై చెయ్యవసరం లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది. ఇది మెదడును చల్ల పరుస్తుంది. ఒక కోర్సులో 3 ఫైల్స్ ధర రూ. 35/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**SHYAM AYURVED BHAVAN (AP)**
***P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105***